సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మందలపర్తి చంద్రశేఖర్ దంపతులు (భీమవరం) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




వెంకన్న పెళ్లికొడుకాయనె

వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు సోమవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి.

8లో

సాగుకు 9,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వర్షాకాలానికి 18 లక్షల టన్నుల ఇసుక సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 18 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డులలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక రీచ్‌లు నిర్వహిస్తున్న గ్రామాల పరిధిలో మౌలిక సదుపాయాలు, రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక స్టాక్ యార్డులకు ఆయా నియోజకవర్గాల్లో అనువైన ప్రదేశాలపై ప్రతిపాదన అందజేయాలని ఆర్డీఓలకు సూచించారు. స్టాక్ పాయింట్ల వద్ద తగిన నిఘా వ్యవస్థ ఉండాలన్నారు. సెమీ మెకనైజ్డ్ కింద పర్యావరణ అనుమతులు పొందిన 10 రీచ్‌ల ద్వారా 57,82,950 మెట్రిక్ టన్నుల ఇసుక త్వరలో అందుబాటులోకి రానున్నదని కలెక్టర్ తెలిపారు. కాటవరం, సింగవరం, కుమారదేవం, తాడిపూడి, పెండ్యాల ఇసుక ర్యాంపుల నిర్వహణ, పర్యవేక్షణ పశ్చిమ గోదావరి, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు జిల్లాల డీఎల్ఎస్‌సీ ఆధ్వర్యంలోనే జరుగుతాయని వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.390 కోట్ల మేర ఖనిజ ఆదాయం సాధించామని జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీఓలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఆర్డబ్ల్యూఎస్ఎస్ ఈఈ బీవీ గిరి, జిల్లా భూగర్భజల శాఖ అధికారి వై.శ్రీనివాస్, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, ఇరిగేషన్ డీఈ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డెలివరీ బాయ్స్ ఈ–శ్రమ్‌లో నమోదు చేసుకోవాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్, బ్లింకిట్, జొమాటో, స్విగ్గీ, ఊబర్, ర్యాపిడో, ఓలా వంటి సంస్థల్లో పని చేస్తున్న డెలివరీ రంగ ఉద్యోగులు ఈ–శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు ఉచితంగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తద్వారా కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసే గుర్తింపు కార్డు పొంది, సంక్షేమ పథకాలు అందుకోవచ్చని వివరించారు. కేంద్ర బడ్జెట్‌లో అసంఘటిత రంగ కార్మికులకు ప్రకటించిన సంక్షేమ ప్రయోజనాలు అందుకునేందుకు ఆయా ప్లాట్‌ఫామ్ కార్మికులు తమ పేర్లను ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలి కోరారు.

పీజీఆర్ఎస్‌కు 193 అర్జీలు



దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న జేసీ చిన్నరాముడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు 193 అర్జీలు సమర్పించారు. వారి నుంచి అధికారులతో కలసి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో 946 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయని, వాటిలో ఇంకా 69 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రీ ఓపెన్ అయిన ప్రతి అర్జీదారును వ్యక్తిగతంగా కలిసి, పరిష్కారం వివరాలు తెలియజేయాలని సూచించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యాన ఆరుగురు దివ్యాంగులకు వివిధ ఉపకరణాలను జేసీ అందజేశారు.

డీసీహెచ్ఎస్‌గా పద్మ



బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మ

కొవ్వూరు: జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్)గా ఎం.పద్మ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడకు వచ్చి, సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను కార్యాలయ సిబ్బంది, కొవ్వూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయికిరణ్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీసీహెచ్ఎస్‌గా పని చేసిన ఎం.పద్మజారాణి విజయనగరం డీసీహెచ్ఎస్‌గా బదిలీ అయ్యారు.

పేదల ఆరోగ్యంపై.. నిర్లక్ష్యపు పడగ

- ఆగిన ఎన్టీఆర్ వైద్య సేవ
- నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.150 కోట్లకు పైగా బకాయిలు
- చెల్లించాలంటూ యాజమాన్యాల విన్నపాలు
- స్పందించని సర్కారు.. నిలిచిన వైద్య సేవలు
- చికిత్సకు వచ్చి నిరాశతో వెనుదిరిగిన రోగులు
- ఇప్పటికే ఈహెచ్ఎస్ సేవల నిలిపివేత



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: పేదలకు ఆధునిక, కార్పొరేట్ వైద్యం, శస్త్రచికిత్సలను ఉచితంగా అందించే ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) ఆగింది. రెండు దశాబ్దాలుగా ఎంతో మంది పేదల ప్రాణాలు నిలిపిన ఈ పథకం.. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో నిలిచిపోయింది. ఈ పథకాన్ని అమలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు. ఫలితంగా ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారిందని, తమకు వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే వైద్య సేవలు నిలిపివేస్తామని కొన్ని రోజుల ముందే నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు నోటీసులు ఇచ్చాయి. బకాయిల అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం స్పందించలేదు. ఈ నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు సోమవారం నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేశాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి ఆరోగ్యశ్రీ ఉచిత చికిత్స కోసం వివిధ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లిన రోగులు, వారి బంధువులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. డబ్బులు చెల్లిస్తేనే వైద్యం చేస్తామని ఆయా ఆస్పత్రుల సిబ్బంది చెప్పడంతో కంగు తిన్న పేదలు ఏం చేయాలో తెలియని ఆవేదనతో వెనుతిరిగారు. పేదల ప్రాణదాయినిగా ఉన్న ఈ పథకం నిలిచిపోవడానికి కారణమైన కూటమి ప్రభుత్వానికి వారు శాపనార్థాలు పెట్టారు.

రూ.150 కోట్లకు పైగా బకాయిలు

ఎన్టీఆర్ వైద్యసేవ కింద తెల్ల రేషన్‌కార్డు దారులకు కార్పొరేట్ స్థాయిలో వివిధ చికిత్సలు, ప్రొసీజర్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. దీనికి అయిన ఖర్చును ప్రభుత్వమే ఆయా ఆస్పత్రులకు చెల్లిస్తూంటుంది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంటే.. గడచిన పది నెలలుగా నయాపైసా కూడా చెల్లించలేదు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద గుండె, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో, జనరల్ మెడిసిన్, ఆర్థో తదితర శస్త్రచికిత్సలు చేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులకు జిల్లా వ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దీని కోసం పదేపదే విజ్ఞప్తులు చేసినా, ఉన్నతాధికారులతో చర్చలు జరిపినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఈ ఉచిత వైద్య సేవలను ఆయా ఆస్పత్రులు నిలిపివేశాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈహెచ్ఎస్ సేవలు నిలిచిపోయాయి. ఈ తరుణంలో ఎన్టీఆర్ వైద్య సేవలు సైతం ఆగిపోతే తమ పరిస్థితేమిటనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సేవలు నిలిపివేసినట్లు ఆయా ఆస్పత్రుల సిబ్బంది చెబుతూండటంతో శస్త్రచికిత్సలకు వచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. అయితే, జిల్లా వ్యాప్తంగా 35 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ ఉచిత సేవలు కొనసాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

నిర్వీర్యం చేసేందుకు కుట్ర

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన వెంటనే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేరును ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చింది. భవిష్యత్తులో ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి బీమా పథకం అమలు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఈ పథకం బాధ్యతల్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతోంది. ప్రస్తుతం అమలవుతున్న ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల మేర హెల్త్ కవరేజ్ లభిస్తోంది. ఈ విధానాన్ని బీమాలోకి తీసుకువస్తే.. ఏ మేరకు లబ్ధి చేకూరుతుందనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఊపిరి

పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వినూత్న రీతిలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఆయన తనయుడు, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకంలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 938 వ్యాధులు, ప్రొసీజర్లతో ప్రారంభమైన ఆరోగ్యశ్రీ పథకం ప్రస్థానం 3,275 వ్యాధులు, ప్రొసీజర్లు విస్తరించారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు, డ్యూటీ డాక్టర్, స్పెషలిస్టు వైద్యులతో పాటు నర్సు, పారామెడికల్ సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. రోగులకు నాణ్యమైన మందులు, పౌష్టికాహారం అందజేసేలా చూశారు. ఆరోగ్య మిత్రతో కూడిన హెల్ప్‌డెస్క్ పక్కాగా ఏర్పాటు చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలోని వ్యాధులకు చికిత్సను నిరాకరిస్తే ఆయా నెట్‌వర్క్ ఆస్పత్రులపై చర్యలు తీసుకునేలా నిబంధనలు రూపొందించారు.

రూ.508.49 కోట్లు వెచ్చింపు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం అమలుకు భారీగా ఖర్చు చేసింది. జిల్లా వ్యాప్తంగా పేద, మధ్య తరగతి ప్రజల వైద్యం, శస్త్రచికిత్సలకు రూ.508,49,95,571 కోట్లు వెచ్చించింది. 2,48,805 మందికి వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసింది. ఏటా రూ.50 కోట్లకు పైనే నిధులు ప్రజారోగ్యం కోసం ఖర్చు చేసింది. ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని వర్తింపజేసి, దీనిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచింది. గుండె, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, క్యాన్సర్ వంటి ఖరీదైన శస్త్రచికిత్సలకు సైతం ఆరోగ్యశ్రీలో చోటు కల్పించింది. గత సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంస్కరణలతో ఖరీదైన వ్యాధులకు సైతం ఉచితంగా చికిత్స చేయించుకునే వెసులుబాటు పేదలకు కలిగింది. బైలాటరల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్‌కు రూ.11.97 లక్షలు, అల్లోజెనిక్ బోన్‌మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (14 ఏళ్ల పైన) రూ.11 లక్షలు, గుండె మార్పిడికి రూ.10.77 లక్షలు వెచ్చించేలా ఏర్పాటు చేశారు.

అత్యవసర వైద్యానికి ఇబ్బంది లేదు



జిల్లాలో 29 ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఈ పథకాన్ని ఆపేశాయి. మిగిలిన ఆస్పత్రుల్లో యథావిధిగా నడుస్తోంది. సేవలు నిలిపివేసినా అత్యవస వైద్యానికి వచ్చే రోగులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. సేవలు ఆపేసిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుతున్నాయి.

– డాక్టర్ ప్రియాంక, జిల్లా కో ఆర్డినేటర్, ఎన్టీఆర్ వైద్య సేవ

అధికారుల లెక్కలివీ..

జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ అందిస్తున్న ఆస్పత్రులు	81
వీటిలో ప్రభుత్వ ఆస్పత్రులు	35
ప్రైవేటువి	46
వీటిలో సేవలు పూర్తిగా నిలిచినవి	29
అడపాదడపా సేవలు అందిస్తున్నవి	17

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ లబ్ధి వివరాలు

సంవత్సరం	వైద్యం చేయించుకున్న వారు	వెచ్చించిన మొత్తం (రూ.కోట్లు)
2019–20	25,750	62.71
2020–21	29,602	62.15
2021–22	47,039	89.48
2022–23	1,46,414	294.15

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ ఉల్లంఘనే..


- ముస్లింల అస్తిత్వాన్ని అస్థిరపరిచే కుట్ర
- జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దేశంలోని సుమారు 22 కోట్ల మంది ముస్లింల అస్తిత్వాన్ని అస్థిరపరిచేలా వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకుందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్ అన్నారు. జాంపేటలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, ఈ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు పలకడం ద్వారా దేశంలోని ముస్లింల మేలును కాంక్షించబోమనే విషయాన్ని రుజువు చేశాయని విమర్శించారు. ముస్లింల ఆస్తులను కాజేసే కుట్రలో భాగంగానే ఈ చట్టం తెచ్చారని, మత విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ ప్రధాన అజెండా అని ధ్వజమెత్తారు. ఈ చట్టం ముస్లింల షరియత్‌కు పూర్తి విరుద్ధమన్నారు. ముస్లింల అభివృద్ధికి దానం చేసిన స్థిర, చర ఆస్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అధీనంలో ఉంచుకోవాలని, తద్వారా వారిని అణచివేసే లక్ష్యంతోనే ఇలాంటి నల్ల చట్టం తీసుకువచ్చారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26లను అపహాస్యం చేస్తూ ముస్లింలను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారన్నారు. అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకునేలా చట్టంలో ఎలాంటి మార్పూ చేయలేదని, ఇది కేవలం బడాబాబులకు దోచిపెట్టడమేనని ఆరిఫ్ విమర్శించారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు హాని తలపెట్టే ఎటువంటి చర్యలనూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ఏనాడూ చేపట్టలేదని చెప్పారు. ఎన్ఆర్‌సీ బిల్లును సైతం రాష్ట్రంలో అమలు చేసేది లేదని అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించడం ద్వారా దేశవ్యాప్తంగా మతసామరస్యాన్ని కాంక్షించే మేధావులు, లౌకికవాదులు ఆయనను ప్రశంసిస్తున్నారని చెప్పారు. రాజ్యసభలో వైఎస్సార్ సీపీ క్రాస్ ఓటింగ్ చేసిందంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని దేశవ్యాప్తంగా పలువురు ఖండిస్తున్నారని, ఇది టీడీపీ నీచమైన కుట్రగా అభివర్ణిస్తున్నారని అన్నారు. ముస్లింలకు ఎటువంటి నష్టం జరగనివ్వనని ఇఫ్తార్ విందులో హామీ ఇచ్చి, రెండు రోజులు తిరగక ముందే వక్ఫ్ సవరణ చట్టానికి చంద్రబాబు మద్దతు పలికారని, చెప్పిన మాటపై ఎప్పుడూ నిలబడరనే విషయాన్ని మరోసారి రుజువు చేశారని దుయ్యబట్టారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీలోని ముస్లిం నాయకులు ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకుని, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, దీని కోసం పార్టీలకతీతంగా ఉద్యమించడానికి సిద్ధంగా ఉండాలని ఆరిఫ్ పిలుపునిచ్చారు.

గ్రాసిమ్ నుంచి ముడుపుల కోసమే..

- అందుకే అసెంబ్లీ వేదికగా క్యాన్సర్ ప్రచారం
- అనపర్తి ఎమ్మెల్యే అత్యుత్సాహం బలభద్రపురానికి శాపం
- వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం



డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో గ్రాసిమ్ ఇండస్ట్రీ యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురి చేసి, వారి నుంచి ముడుపులు పొందడమే ధ్యేయంగా అసెంబ్లీ వేదికగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి క్యాన్సర్ ప్రచారం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. అంతే తప్ప బలభద్రపురం, పరిసర ప్రాంత ప్రజల క్షేమం కోరి కాదని అన్నారు. అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లమిల్లి లేవనెత్తిన క్యాన్సర్ అంశం బలభద్రపురానికి శాపంగా మారిందని ధ్వజమెత్తారు. ఇటీవల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడినట్టుగా క్యాన్సర్‌పై ముందే ప్రైవేటు సంస్థలతో సర్వేలు చేయించి, అప్పుడు అసెంబ్లీలో ప్రస్తావిస్తే బాగుండేదని అన్నారు. అలా కాకుండా బలభద్రపురంలో 200 మందికి పైగా క్యాన్సర్ బాధిత కుటుంబాలను పరామర్శించానంటూ ఎమ్మెల్యే చెప్పారని, దీనిలో నిజం ఎంతుందో ఆయనకే తెలుసని అన్నారు.

తప్పుడు ప్రచారంతో ఊరికి చేటు

అసెంబ్లీలో రామకృష్ణారెడ్డి క్యాన్సర్ అంశాన్ని ప్రస్తావించడం, దానిపై మీడియా అత్యుత్సాహంతో విపరీత ప్రచారం కల్పించడంతో బలభద్రపురం ప్రాంతాన్ని క్యాన్సర్ భూతం కబళించిందేమో అనే స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగిందని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ ప్రచారంతో ఆ గ్రామంలోని తమ వారి ఇళ్లకు రావటానికి ఇతర ప్రాంతాల్లోని బంధువులు భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒకవేళ వచ్చినా కనీసం మంచినీళ్లు తాగడానికి కూడా భయపడిపోతున్నారన్నారు. అలాగే, ఆ ఊరి వారితో వివాహ సంబంధాలు కలుపుకోవాలన్నా బయటి గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బలభద్రపురంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో సర్వే చేస్తూంటే, వారిని కూడా బెదిరించి విషయాన్ని పక్కతోవ పట్టిస్తూ లేనిది ఉన్నట్లుగా చూపించేందుకు ఎమ్మెల్యే విఫలయత్నం చేశారని మాజీ ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ప్రభుత్వ సర్వేలో జాతీయ సగటు కంటే తక్కువగా బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని, సాక్షాత్తూ బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రకటించారని గుర్తు చేశారు. డైవర్షన్ రాజకీయాలకు అలవాటు పడిన ఎమ్మెల్యే నల్లమిల్లి ఇంకా స్వతంత్ర సర్వే అంటూ, అసలు విషయాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు.

గ్రాసిమ్ ఇండస్ట్రీ ఏర్పాటు సమయంలో జరిగిన విషయాలన్నీ ప్రజలకు తెలుసునని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చెప్పారు. 2019 ప్రథమార్థంలోనే నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే కేపీఆర్ సంస్థ నుంచి గ్రాసిమ్ సంస్థకు భూబదలాయింపు చేశారన్నారు. ఆ తర్వాత వెంటనే దొంతమూరులో జరిగిన అఖిలపక్ష సమావేశంలో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వారం రోజుల్లో భూబదలాయింపు ఉత్తర్వులు రద్దు చేయిస్తానని చెప్పి, ఆ పని ఎందుకు చేయించలేకపోయారని, దీని వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గ్రాసిమ్ ఇండస్ట్రీ వలన ప్రజలకు ఏదైనా ఇబ్బంది కలిగితే, అధికారంలో ఉన్నందున చిత్తశుద్ధి ఉంటే తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించారు. అంతే తప్ప అవగాహన లేకుండా బలభద్రపురానికి, పరిసర ప్రాంతాలకు మాయని మచ్చ తీసుకురావద్దని హితవు పలికారు. ప్రజలు భయాందోళనలకు గురి కావద్దని, అంతా మంచి జరుగుతుందని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు.

మందకొడిగా..

- గిట్టుబాటు కాని వర్జీనియా పొగాకు ధర
- అమ్మకాలకు ఆసక్తి చూపని రైతులు
- కిలో గరిష్ట ధర రూ.290



దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయి. మన జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు గత నెల 24న ప్రారంభించారు. సుమారు 15 రోజులైనప్పటికీ క్రయవిక్రయాలు మందకొడిగానే సాగుతున్నాయి. ఇప్పటి వరకూ 12 రోజుల పాటు వేలం జరగగా, మార్కెట్‌లో ధర నిలకడగా కొనసాగుతూండటంతో రైతులు అసంతృప్తి చెందుతున్నారు. కిలోకు గరిష్ఠంగా రూ.290 పలుకుతున్నప్పటికీ ఎక్కువ శాతం బేళ్లకు రూ.270 నుంచి రూ.280 మధ్య వస్తోందని, ఇది గిట్టుబాటు కాదని చెబుతున్నారు. ఉత్పత్తి వ్యయంతో పాటు పెట్టుబడి, కూలీల ఖర్చులు, భూముల కౌలు, బ్యారన్ల అద్దెలు రెట్టింపు అయినందున గిట్టుబాటు ధర ఇవ్వకపోతే కోలుకోవడం కష్టమని రైతులు అంటున్నారు. కొనుగోళ్ల ప్రారంభంలో ఇస్తున్న ధరకు, చివరిలో లభిస్తున్న ధరకు ఎక్కువ వ్యత్యాసం ఉంటోందని, దీనివలన ముందుగా అమ్ముకున్న వారు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో ముందుగా పంట అమ్ముకోవడానికి వారు వెనుకాడుతున్నారు. మొత్తం ఐదు వేలం కేంద్రాలకు గాను దేవరపల్లికి అతి తక్కువగా రోజుకు 80 నుంచి 135 బేళ్లు మాత్రమే అమ్మకానికి వస్తున్నాయి. మొత్తం 12 రోజుల్లో 10,272 బేళ్ల వేలం జరిగింది. సోమవారం దేవరపల్లి వేలం కేంద్రానికి 134, జంగారెడ్డిగూడెం–1కు 606, జంగారెడ్డిగూడెం–2కు 220, కొయ్యలగూడేనికి 204, గోపాలపురం వేలం కేంద్రానికి 263 చొప్పున బేళ్లు అమ్మకానికి వచ్చాయి.

13.36 లక్షల కిలోల విక్రయం

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకూ సుమారు రూ.38.47 కోట్ల విలువైన 13,36,900 కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలో గరిష్ఠ ధర రూ.290, కనిష్ఠ ధర రూ.265, సగటు ధర రూ.280.31 లభించింది. దాదాపు 25 కంపెనీలు వేలంలో పాల్గొనవలసి ఉండగా, ప్రస్తుతం 6 కంపెనీలు మాత్రమే పాల్గొంటున్నాయి. వస్తున్న బేళ్లు తక్కువగా ఉండటంతో గోపాలపురం కేంద్రంలో కొనుగోళ్లు ముగించుకుని, దేవరపల్లిలో వేలం నిర్వహిస్తున్నారు. కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు పూర్తి కానందున పూర్తి స్థాయిలో కంపెనీలు వేలంలో పాల్గొనడం లేదని బోర్డు అధికారులు చెబుతున్నారు.


వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు, ధరల వివరాలు

వేలం కేంద్రం	కొనుగోలు (కిలోలు)	సగటు ధర (కిలోకు రూ.)
దేవరపల్లి	1,19,890	282.66
జంగారెడ్డిగూడెం-1	4,37,109	279.37
జంగారెడ్డిగూడెం-2	4,00,020	278.64
కొయ్యలగూడెం	2,09,378	282.44
గోపాలపురం	1,70,501	282.40

70 మిలియన్ల కిలోల ఉత్పత్తి అంచనా

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో ఈ ఏడాది 70 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని బోర్డు అధికారులు, కొనుగోలుదారులు, రైతు సంఘాల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. తోటలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఆకు గుల్లబారి తూకం రావడం లేదని రైతులు తెలిపారు. పొగాకు బోర్డు 56.88 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అయితే, గత ఏడాది మార్కెట్లో కిలోకు గరిష్ఠంగా రూ.410 ధర పలకడంతో ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో పంట వేశారు. అధికారిక లెక్కల ప్రకారం 29,450 హెక్టార్లలో పొగాకు సాగు జరుగుతోంది. అయితే, బోర్డు అనుమతి లేకుండా సుమారు 5 వేల హెక్టార్లలో అదనంగా పంట సాగులో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో 70 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని బోర్డు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

తక్కువ బేళ్లు వస్తున్నాయి



వేలం కేంద్రాలకు రైతులు తక్కువ సంఖ్యలో బేళ్లు తీసుకు వస్తున్నారు. జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాలకు ఎక్కువ బేళ్లు వస్తూండగా, గోపాలపురం, దేవరపల్లి కేంద్రాలకు తక్కువగా వస్తున్నాయి. బ్లాక్ సాయిల్ పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు వేలానికి రావడం లేదు. దీంతో బ్లాక్ సాయిల్ పొగాకు కొనుగోళ్లు జరగడం లేదు. రైతులు మంచి రోజుల కోసం చూస్తున్నారు. ఈ నెలాఖరు నుంచి కొనుగోళ్లు వేగం పుంజుకుంటాయి.

– జీఎల్‌కే ప్రసాద్, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ ప్రాంతాల్లోని 4,60,582, పట్టణ ప్రాంతాల్లోని 7,38,246 గృహాల్లో ఇంటింటి సర్వే చేపట్టి, అదృశ్యమైన వారి వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో 10,05,186 మందికి గాను 9,19,137 మంది, పట్టణ ప్రాంతాల్లో 4,18,258 మందికి గాను 3,19,370 మంది వివరాలు సేకరించారని తెలిపారు. జిల్లాలో 40,703 మంది పిల్లలకు గాను, ఇంకా 2,921 మంది ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. దీనికోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ హేతుబద్ధీకరణ ప్రక్రియ నేపథ్యంలో జిల్లాలోని 512 గ్రామ, వార్డు సచివాలయాల్లో 4,248 మందికి గాను 3,720 మంది పని చేస్తున్నారని, 528 ఖాళీలున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలమూరు: చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన వ్యాపారవేత్త ముత్యాల వీర భాస్కరరావు, కృష్ణవేణి దంపతులు సోమవారం రూ.1,01,116 అందజేశారు. గాలి గోపురం నిర్మాణానికి ఈ విరాళం ఇచ్చారు. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావు(అబ్బు)కు నగదు రూపంలో ఈ మొత్తం అందజేశారు.

క్లుప్తంగా

గల్లంతైన యువకుడి మృతదేహం గుర్తింపు



కాలువలో దొరికిన షేక్ ఖాదర్ మృతదేహం



మృతి చెందిన షేక్ ఖాదర్ (ఫైల్)

రావులపాలెం: స్నేహితులతో సరదాగా గోపాలపురం కాలువ వద్ద స్థానానికి వెళ్లి గల్లంతయిన యువకుడు షేక్ ఖాదర్ (21) మృతదేహం సోమవారం సంఘటన ప్రాంతానికి వంద మీటర్ల దూరంలో కాలువలో గుర్తించారు. ఆదివారం మధ్యాహ్నం గోపాలపురం ఆరుమామిళ్ల గట్టు రేవు వద్ద స్నానానికి దిగిన ఖాదర్ గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం రేవుకు 100 మీటర్ల దూరంలో మృతదేహం తేలడంతో ఖాదర్ బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు టౌన్ సీఐ శేఖర్‌బాబు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించగా స్థానిక నెక్కంటి కాలనీలో ఉన్న బరియల్ గ్రౌండ్‌లో ఖననం చేసినట్టు బంధువులు తెలిపారు.

బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి

పెద్దాపురం: బాయిలర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక వాలు తిమ్మాపురం రహదారిలో ఉన్న పట్టాభి ఆగ్రో ఫుడ్స్ రైస్ మిల్లులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నగరానికి చెందిన వేముల శివ (29) ఫ్యాక్టరీకి పనిమీద వచ్చి, ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇంతలో బాయిలర్ నుంచి విడుదలైన వేడినీటి కారణంగా అతడు మృతి చెందినట్టు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్న పెళ్లికొడుకాయెనే

ఘనంగా ప్రారంభమైన కోనేటి రాయుడి కల్యాణోత్సవాలు



ధ్వజారోహణ, అంకురార్పణ నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిచెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు సోమవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. దేవదాయ - ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో మిరుమిట్లు గొలిపేలా సుందరంగా అలంకరించారు. బొబ్బర్లంక - రావులపాలెం ప్రధాన రహదారి నుంచి వాడపల్లికి వెళ్లే రహదారుల ముఖద్వారాల్లో కల్యాణోత్సవ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు, ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున పెండ్లి కుమారునిగా అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మేళతాళాల నడుమ ఈ వేడుక నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వారి గోత్ర నామాలతో పెండ్లి కుమార్తెలుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6-15 గంటలకు స్వామివారి ధ్వజారోహణ, అంకురార్పణ, నిత్య బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీఓ పీ శ్రీకర్, సీఐ సీహెచ్ విద్యాసాగర్ కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.



విద్యుత్ దీపాల అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రం

నేడు స్వామివారి కల్యాణోత్సవం

వాడపల్లి క్షేత్ర ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3గంటలకు స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నామన్నారు. ప్రజాప్రతినిదులు, నాయకులు, అధికారులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. రథోత్సవం, కల్యాణ వేడుకల్లో భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పట్టా పండగకు సన్నాహాలు

- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవానికి నోటిఫికేషన్
- దరఖాస్తులకు తుది గడువు 15వ తేదీ
- గవర్నర్‌కు ఆహ్వానం



జేఎన్‌టీయూకే యూనివర్సిటీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ 11వ స్నాతకోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విద్యార్థులు ఒరిజనల్ డిగ్రీ కోసం ఏప్రిల్ 15 తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ వెబ్‌సైట్‌లో సూచించారు. గత మార్చి 1వ తేదీన నోటిఫికేషన్ జారీచేయగా తుది గడువు మార్చి 30వ తేదీతో ముగియగా అభ్యర్థులు తక్కువగా దరఖాస్తు చేసుకోవడంతో మరో 15రోజులపాటు ఏప్రిల్ 15వ తేదీ వరకూ గడువు పెంచారు. దీంతో ప్రముఖుల చేతుల మీదుగా సంప్రదాయ వస్త్రధారణలో పట్టా(ఒరిజనల్ డిగ్రీ) అందుకోవాలని కలలు కంటున్న విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి కలిపి స్నాతకోత్సవం నిర్వహిస్తుండేవారు. ఈ విధానానికి స్వస్తిపలికి ప్రతి ఏడాది వేడుకలు నిర్వహించాలనే ఉద్దేశంతో అప్పటి వీసీ ప్రసాదరాజు 2022లో 8వ కాన్వొకేషన్, 23లో 9, గత ఏడాది జనవరి 31వ తేదిన 10వ కాన్వొకేషన్ నిర్వహించారు. అప్పటి వరకూ పెండింగ్‌లో ఉన్న పట్టాలనీ ఈ కాన్వొకేషన్‌లో జారీ చేశారు. ఇప్పుడు నిర్వహించే వేడుకలకు సంబంధించి 2023-24 లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే వీరికి కులపతి హోదాల గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరై విద్యార్థులకు అందజేస్తారు. వేడుకల నిర్వహణ తేదీ, అనుమతికి ఇప్పటికే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ గవర్నర్‌ను గత నెల 17వ తేదీన కలిసి విన్నవించారు.

దరఖాస్తు చేసుకోవాలి



జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలలలో ఇంజినీరింగ్ లేదా ఫార్మా, మేనేజ్‌మెంట్ విద్యను పూర్తిచేసిన అభ్యర్థులు ఒరిజనల్ డిగ్రీ (పట్టా) కోసం బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు గడవు ఏప్రిల్ 15వ తేది వరకూ పెంచాం. గవర్నర్ అనుమతి వచ్చిన వెంటనే తేదీ ప్రకటిస్తాం.

– ప్రొఫెసర్ నాగేశ్వరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్, జేఎన్‌టీయూకే

కాలువలోకి దూసుకెళ్లిన స్కూలు వ్యాన్



కాలువలో తిరగబడిన వ్యాన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- ఢీకొట్టి వెళ్లిపోయిన లారీ
- ఏడుగురు విద్యార్థులు, డ్రైవరుకు గాయాలు
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పిఠాపురం: పాఠశాలకు విద్యార్థులను తీసుకెళుతున్న స్కూలు వ్యాన్ ప్రమాదానికి గురై పంట కాలువలోకి దూసుకెళ్లడంతో ఏడుగురు విద్యార్థులు, డ్రైవరుకు గాయాలయిన ఘటన గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లప్రోలుకు చెందిన ఒక ప్రైయివేటు స్కూలు వ్యాన్ సోమవారం ఉదయం గొల్లప్రోలు మండలం చెందుర్తిలో విద్యార్థులను ఎక్కించుకుని గొల్లప్రోలు బయలుదేరింది. గ్రామ శివారుకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోవడంతో స్కూలు వ్యాన్ ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో వ్యాన్ పంట కాలువలో తిరగబడడంతో వ్యాన్‌లో ఉన్న జి.హర్షిత, జి.అపర్ణ, జి.సిద్ధు, జి.ధరణి, కె.భార్గవ్, కె.హాసిని, నిహారిక, వ్యాన్ డ్రైవరు వెంకటేష్‌కు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని చూసిన పక్కనే పంట పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు వ్యాన్‌లో ఉన్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీశారు. వారిని పిఠాపురంలో ఒక ప్రైయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. వ్యాన్ డ్రైవరుకు కాలు విరగగా మిగిలిన విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎన్.రామకృష్ణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణంగా చెబుతున్న లారీ ఆపకుండా వెళ్లి పోయినట్లు చెబుతున్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగే సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించి వేగంగా కాలువలోకి దూసుకెళ్లకుండా డ్రైవరు జాగ్రత్తలు తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు విద్యార్థులు చెబుతున్నారు. కాలువలో నీరు సైతం తక్కువగా ఉండడం వల్ల విద్యార్థులు ప్రాణాలతో బయటపడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లి దండ్రులు తీవ్ర ఆందోళన చెందారు.

జిల్లా జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలివీ...

న్యాయమూర్తి	ప్రస్తుతం పనిచేస్తున్న స్థలం	బదిలీ అయిన ప్రాంతం
పి. కమలాదేవి	కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి	1వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కర్నూలు
నిఖిత ఆర్.వి	కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి	ఫ్యామిలీ కోర్టు కం 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, నెల్లూరు
పి.గోవర్థన్	12వ అదనపు జిల్లా జడ్జి, విశాఖపట్నం	6వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కాకినాడ
జి.ఆనంది	పోక్సో కోర్టు, విశాఖపట్నం	3వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కాకినాడ
డి.విజయ గౌతమ్	రాజమహేంద్రవరం 5వ అదనపు జిల్లా జడ్జి	12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, విశాఖపట్నం
ఆర్.శ్రీలత	రాజమహేంద్రవరం ప్రత్యేక ఎస్సీ,ఎస్టీ కోర్టు కం 10వ అదనపు జిల్లా జడ్జి	7వ అదనపు జిల్లా జడ్జి, మదనపల్లి
పి.వి.ఎస్. సూర్యనారాయణమూర్తి	ఏసీబీ కోర్టు ,రాజమహేంద్రవరం	2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, మదనపల్లి
ఎస్.ఉమాసునంద	పోక్సో కోర్టు, ఏలూరు	10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రాజమహేంద్రవరం
ఎ.వసంతి	12వ అదనపు జిల్లా జడ్జి, పిఠాపురం	10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, నరసాపురం
ఎం.శ్రీహరి	4వ అదనపు జిల్లా జడ్జి, గూటి, అనంతపురం జిల్లా	12వ అదనపు జల్లా జడ్జి, పిఠాపురం
ఎం.శంకరరావు	అదనపు జిల్లా జడ్జి, రామచంద్రపురం	పోక్సో కోర్టు, చిత్తూరు
వి.నరేష్	2వ అదనపు జిల్లా జడ్జి, అమలాపురం	10వ అదనపు జిల్లా జడ్జి, అనకాపల్లి

ఇద్దరి అరెస్టు : 12 మోటార్ సైకిళ్లు స్వాధీనం

కొత్తపల్లి: చెడు వ్యసనాలకు బానిసలై మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని పిఠాపురం సీఐ వి. శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 30వ తేదీన యండపల్లిలో జరిగిన నూకాలమ్మతల్లి జాతరలో ఉమ్మిడి నాగేశ్వరరావు మోటార్ సైకిల్ దొంగతనానికి గురైంది. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మండలంలోని కొమరగిరి శివారు జగనన్న కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పాడకు చెందిన సూరాడ బాబు, చింతకాయల ఏసేబులను అరెస్టు చేసి దర్యాప్తు చేయగా వారి వద్ద నుంచి 12 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో కొత్తపల్లి-5, పిఠాపురం టౌన్-3, గొల్లప్రోలు, తొండంగి, కాకినాడ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనాలకు గురైన 12 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలోని రామన్నపాలెంలో ఉన్న పాత ఇనుప సామాన్లు కొను గోలు చేస్తున్న దొంగల నూకరాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రమణబాబు (ఫైల్)

తుని: క్రికెట్ బెట్టింగ్‌లో సొమ్ము కోల్పోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కోలనాటి రమణబాబు (33) ఆత్మహత్య చేసుకున్నాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవా రం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం నక్కపల్లి గ్రామానికి రమణబాబు వర్క్ ఫ్రం హోంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నెలవారీ వస్తున్న జీతం ఇంటికి ఇవ్వకుండా బెట్టింగ్‌కి అలవాటు పడి సొమ్ము పోగొట్టుకున్నాడు. అప్పుల బాధతో నర్సీపట్నం- రేగుపాలెం మధ్యలో రైలు పట్టాల పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆత్మహత్య కాదు హత్యే అంటూ నిరసన

పోలీసుల అదుపులో 17 మంది



ఫంక్షన్ హాల్ వద్ద నిరసనకు దిగిన వారిని అడ్డుకుంటున్న పోలీసులు

సీతానగరం: మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలోగల శ్రీరామనగరంలోగల రాజుగారి కల్యాణ మండపంలో ఆదివారం రామచంద్రపురానికి చెందిన వేమగిరి సునీల్ (26) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోలేదని, అది హత్యేనంటూ బంధువులు, స్నేహితులు రాజుగారి గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద నిరసన చేపట్టారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సునీల్ మృతదేహం అంబులెన్స్‌లో తీసుకువచ్చి ఫంక్షన్ హాల్ వద్ద నిరసన తెలిపారు. మృతదేహాన్ని అంబులెన్స్ నుంచి కిందకు దించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఫంక్షన్ హాల్ యజమాని రాజు, హైదరాబాద్ నుంచి వచ్చిన మహిళ సునీల్‌ను హత్య చేశారని, వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కోరుకొండ ఇన్‌చార్జి సీఐ, రాజమహేంద్రవరం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఈ బాలసౌరి అక్కడికి వచ్చారు. సీతానగరం - రాజమహేంద్రవరం రోడ్డుపై ధర్నాకు ప్రయత్నించగా ఎస్సై డి.రామ్‌కుమార్ తన సిబ్బందితో అడ్డుకుని 17 మందిని అదుపులోకి తీసుకుని కోరుకొండ తరలించారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ బాలసౌరి విలేకరులతో మాట్లాడుతూ మృతుడు సునీల్‌కు వరుసకు మరదలైన మహిళ హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రయివేట్ బస్‌లో సీతానగరం చేరుకుందని, రాజు గారి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గది తీసుకున్నారన్నారు. సాయంత్రం 4 గంటలకు మహిళ బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చే సరికి సునీల్ ఉరివేసుకుని ఉన్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రూ.10 లక్షల విలువైన రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన వాహనాలు

రాజానగరం: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షలు విలువ చేసే రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నామని స్థానిక డిప్యూటీ తహసీల్దారు (పౌరసరఫరాలు) గొలుగూరి బాపిరాజు తెలిపారు. మూడు వాహనాలలో తరలిస్తున్న ఈ బియ్యాన్ని వాహనాలతో సహా స్వాధీన పర్చుకుని, కేసులు నమోదు చేసేందుకు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గొల్లప్రోలుకు చెందిన ఆకుల స్వామి, పెద్దాపురం మండలం గోరంట్లకు చెందిన కోన బాలరాజు, కోరుకొండ అచ్చిరాజు తమ వాహనాలలో ఈ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారు. వారిపై కూడా కేసులు నమోదు చేయడంతోపాటు ఈ అక్రమ దందాకు ప్రధాన కారకులు ఎవరనే విషయమై ఆరా తీస్తున్నామని చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.10 లక్షలు కాగా, వాహనాల విలువ రూ.20 లక్షలు పైబడి ఉంటుందన్నారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు ఆసరా

- తూర్పు గోదావరి, కోనసీమ ఇన్‌చార్జిగా శ్రీహరి ప్రసాద్
- ఫౌండర్ హబీబ్ సుల్తాన్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న హబీబ్ సుల్తాన్ అలీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వినియోగదారుల సంక్షేమం, హక్కుల రక్షణ కోసం ఆసరా పనిచేస్తోందని సంస్థ వ్యవస్థాపకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ చెప్పారు. భారత దేశం అంతటా 10కి పైగా రాష్ట్రాలలో ఒకే లక్ష్యంతో అంకితభావంతో ఆసరా పనిచేస్తోందన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి కసరత్తు చేస్తున్నామన్నారు. 2016లో ప్రారంభమైన తమ సంస్థ 2,500 అవగాహన సదస్సులు నిర్వహించిందని చెప్పారు. వినియోగదారుల తరపున కోర్టుల్లో కేసులు దాఖలు చేసి ఉచితంగా సేవలు అందిస్తున్నామన్నారు. అయితే ఈ మధ్య స్టేషనరీ వంటి ఖర్చుల కోసం అతి తక్కువ ఫీజు తీసుకుని కేసులు దాఖలు చేస్తున్నామని చెప్పారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఆసరా ఇన్‌చార్జిగా శ్రీహరి రాజును నియమించినట్లు సుల్తానా అలీ తెలియజేస్తూ, ఆయనకు నియామక పత్రం అందించి, ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీహరి రాజు మాట్లాడుతూ వినియోగదారులకు తమ హక్కులపై అవగాహన కల్పించి, వారు మోసపోకుండా చూస్తామని చెప్పారు. అడ్వకేట్స్ కానివాళ్లను కూడా ఇందులో సభ్యులుగా వేసుకుని, కేసులు దాఖలు చేయిస్తున్నామని అలీ చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసు, ఈశ్వరాచారి, రామలింగారెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

వేమగిరిలో తిరుమల క్యాంపస్‌కు భూమి పూజ



వేమగిరిలో భూమిపూజ చేస్తున్న తిరుమలరావు దంపతులు

కడియం: వేమగిరి జాతీయ రహదారి పక్కనే తిరుమల విద్యాసంస్థల కొత్త ప్రాంగణానికి సోమవారం భూమి పూజ చేసినట్లు సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వేమగిరి చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ డేస్కాలర్ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఇక్కడ ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు క్లాసులు నిర్వహిస్తామని, 2026-27 నుంచి అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ముందుగా తిరుమలరావు, సరోజినీదేవి దంపతులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సంస్థ అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల భూరి విరాళం



పాఠశాల హెచ్‌ఎం సునీతకు రూ.6లక్షల చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హెచ్‌ఎంకు రూ.6లక్షల చెక్కు అందజేత

రాయవరం: సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహితులంతా తిరిగి అదే చదువులమ్మ చెట్టు నీడకు మరోసారి చేరుకున్నారు. ఇంత స్థాయికి చేరుకోవడానికి కారణమైన పాఠశాల అభివృద్ధికి మిత్రులంతా కలిసి భారీ విరాళాన్ని అందజేశారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1975-80 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సోమవారం పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీతకు రూ.6లక్షల చెక్కును అందజేశారు. పూర్వ విద్యార్థులు ఆర్‌వీవీ సత్యనారాయణచౌదరి, తాడి వెంకటరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, కె.వెంకటరెడ్డి, ఎం.సూరారెడ్డి తదితరులు పాఠశాల హెచ్‌ఎంకు చెక్కును అందజేశారు. పూర్వ విద్యార్థి ఆర్‌వీవీ సత్యనారాయణచౌదరి మాట్లాడుతూ పాఠశాల భవనంలోని ఒక తరగతి గదికి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ సొమ్మును వినియోగించాలని హెచ్‌ఎం సునీతకు సూచించామన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,500
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260